# లచ్చి సంసారం

శ్రీ సీతారాంగారు

అందాలభరిణెలు అంతఃపురాల్లోనే కాదు చిన్నవూరిగుడిసెల్లోకూడా పుట్టారని నిరూపించేందుకో అన్నట్లు లచ్చి ఓ చిన్న నిరుపేదకుటుంబంలో జన్మించింది. ఆమె చక్కటిచుక్క - మెరుగుపెట్టని వజ్రం. యుక్తవయస్సులోవున్న ఆమెనుచూచి, చూపు మళ్లించుకోవడం ఎంతటివాడికయినా దుస్సాధ్యమయ్యేది. పచ్చటిపసిమి, నవనవలాడే తీరైనఅవయవాలు, విశాలమైనమొగము, మురిపించే ఉంగరాలజుట్టు, ముద్దులమూట గట్టేముక్కు, లేతతమలపాకులవంటి పెదవులు, సన్నటి నాజూకైన కనుబొమలు, లేడికళ్లలాటికళ్లు, చూచినవారి నోరూరించేవి. ముక్కుకునత్తు, చెవికి పెద్దనాగుబాములు, మెడలోపూసలపేర్లు, చేతిని బండగాజులు, నుదుటను పచ్చ, దానిపై పెద్దకుంకంబొట్టు, పెద్దకొప్పు, కొప్పుపై పెద్దబంతిపూలచెండు, ఒయ్యారమయిన నడుము, నగ్నవక్షోజాలు ఒకవైపునుంచి తమఅందాన్ని ఒరగబోసేటట్లుగా వేసిన వల్లెవాటు ద్రావిడ శిలాశిల్పాల్ని స్ఫురణకుతెచ్చేవి.

లచ్చికి యుక్తవయస్సు సమీపించినప్పటినుంచీ ఆమెతల్లి భర్తను వేధించుకుతినడం ఆరంభించింది. పిల్లపెద్దదవుతోంది, ఏదోసంబంధంచూచి ముడిపెట్టివెయ్యమని. ఎదిగినపిల్ల యింట్లోవున్నబరువు ఆడదానికి తెలిసినంతబాగా మొగాడికి తెలియకపోవడంమూలాన కొన్నాళ్లు లచ్చితండ్రి అశ్రద్ధచేశాడుకాని రానురాను ఇరుగూపొరుగూ ఏమనుకుంటారోననే భయంతోటీ, పెళ్లాంపోరుపడలేక శ్రద్ధతీసుకుని దగ్గరవూళ్లు నాలుగూ గాలించి చివరికి ఒక సంబంధం కుదిర్చాడు.

రామిగాడంటే ఇరుగూపొరుగూ అతిప్రేమగావుండేవారు. ఎవరింట్లో ఏకష్టంవచ్చినా తనకష్టంలాగే భావించుకుని పడచాకిరీచేసేవాడు. ఈసంబంధంరాగానే ఇరుగూపొరుగూ, ఆపిల్లనిచేసుకోమని రామిగాడికి సలహాయిచ్చారు. రామిగాడికికూడా, కొన్నాళ్లనుంచీ, వయసురావడంమూలాన గాబోలు, తనకు తెలియకుండానే, చూపు ఆడవాళ్లమీదికి మళ్లుతోంది — లచ్చిచాలా అందంగావుంది; ఎందుకీసంబంధానికి అడ్డుచెప్పాలి?

లచ్చి పెళ్లయింది. వధూవరుల్నిచూచి ఆ గుడిసెల్లోజనం చాలాసంతోషించారు. అమ్మలక్కలు, "ఏముసలిమొగుడో కాకుండా చిన్నవాడు, చక్కటివాడు బుద్ధిమంతుడు దొరికాడు, దానికేంలే హాయిగా బ్రతుకుతుం"దన్నారు. కొందరు వయసుపిల్లలు అతను నల్లగావుంటాడని ఆక్షేపిస్తే ప్రౌఢలు, నల్లగావుంటే ఏమమ్మా మొహంలో కళవుంది, ఎంతబాగుంటాడమ్మా! ఒడ్డూపొడుగూ, కండలుతిరిగినబళ్లూ, ఆకీవైననడక అన్నారు.

పెళ్లి అయిన కొద్దిరోజులికి లచ్చి కాపరానికివచ్చింది. లచ్చీ రామిగాడు చిలకాగోరింకలలా వుండేవారు.

లచ్చికి అత్తవారింటికి వచ్చింది మొదలూ సంసారబాధ్యత నెత్తిన పడింది. ఇంట్లో తన మొగుడికీ వేరుదిక్కులేదు, అతని తల్లీతండ్రీ కొద్దిసంవత్సరాలక్రితమే గతించారు. అతను ఒకచిన్న బియ్యంమిల్లులో కూలిపనిచేసేవాడు. రోజుకి తొమ్మిదిఅణాలు యిచ్చేవారు. అదేవారిద్దరికీ హాయిగా సరిపోయేది. ఏరోజు డబ్బులు ఆరోజు తెచ్చుకుంటూ చీకూచింతా లేకుండా కాలంగడిపేవారు.

ప్రొద్దుటనే బయలుదేరివెళ్ళి మిల్లులో పనిచేసి ప్రొద్దుగ్రుంకినతర్వాత యింటికివచ్చేవాడు రామిగాడు. లచ్చి అంబలి తయారుచేసి మధ్యాహ్నంతనే మిల్లుకి పట్టుకువెళ్ళేది. అక్కడ కూలివాళ్ళంతా ఆమెను పలకరించేవారు; కొందరు దీవించేవారు; కొందరు వోరచూపులు చూచేవారు; కొందరు 'ఎకసెక్కా' లాడేవారు. కొందరు కావాలని రాచుకుంటూ పోయేవాళ్ళు. కొత్తలో లచ్చి చాలా చికాకుపడింది. ఇంటికివచ్చాక ఒకరోజు పట్టలేక మొగుడికి యీ విషయంచెప్పింది.

"షోవోస్, నీకేందే? వాళ్ళకది అలవాటు; నిన్నుకాదనుకోయ్" అన్నాడు బుగ్గగిల్లుతూ గంపెడు ప్రేమతో కౌగిలిలోకి లాగుకుంటూ; లచ్చి పొంగిపోయింది. వీళ్ళప్రేమకు అంతులేదు, ఆడంబరంలేదు. వీరిప్రేమలో లిప్‌స్టిక్‌లులేవు, పౌడర్లులేవు, కార్లులేవు, రైళ్ళులేవు, నదులలో చిన్నపడవలమీద విహారింపులు లేవు. తొణికిసలాడని నిండుప్రేమవారిది. అయినా, నదీసాగరసంగమంలో ఏర్పడే మృదుగంభీరమయిన హోరుమాదిరి, ఆకాశానమబ్బులు హత్తుకున్నప్పుడుకల్గే గర్జరధ్వనిమాదిరి వారిప్రేమ అప్రయత్నంగా వెలికి తెలిసేది.

ఇలా సంవత్సరాలు గడిచాయి, ప్రశాంతంగా, ఆనందంగా, నిముషాలలాగ. ఇద్దరుమగపిల్లలు పుట్టారు లచ్చికి.

ఇప్పుడు రామిగాడి రోజుకూలి తొమ్మిదణాలు చాలడంలేదు. ఇంతలో యుద్ధంకూడావచ్చిపడింది. రానురాను ప్రతివస్తువుకీ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. లచ్చి చెవులవీ, ముక్కువీ అమ్ముకుతిన్నారు కొన్నాళ్ళు. పిల్లలిద్దరికీమాత్రం తిండిపెట్టి పస్తున్నారు కొన్నాళ్ళు.

లచ్చికిపాపం అంతవరకూకష్టాలు తెలియవు. పుట్టిమెట్టింది పేదకుటుంబాలలోనే అయినా, అన్నాళ్ళూ ఒకవెన్నెలరాత్రిలా గడిచిపోయాయి. తనతల్లినీ తండ్రినీ సాయం అడుగుదామంటే వారుమాత్రం వేరే పరిస్థితిలో ఎలావుండగలరు?

రామిగాడు మిల్లులోసరిగ్గా పనిచెయ్యలేకపోతున్నాడు. పస్తుండిఎన్నాళ్ళు బండపనులుచేయగలడు? శరీరం శుష్కింప నారంభించింది. కళ్ళుగుంటలుపడ్డాయి. ఒకవారంరోజుల్లో లచ్చికి రామిగాడికి యిరవై ఏళ్ళొచ్చి మీదపడినట్లయింది. లచ్చి సమయానికి గర్భంకూడదాల్చింది.

లచ్చి యిదివరకెక్కడా కూలిచేసిఎరగదు. మొగుడితోఅంది, ఒకరాత్రి: తనుకూడా ఎవరింట్లోనయినా పనికి కుదురుకుంటానని. "ఊఁ" అన్నాడు రామిగాడు, ఏదోచేయరాని అమానుష కార్యం చేస్తున్నట్లు గుడ్లనీరు గుడ్లను కుక్కుకుంటూ. లచ్చి దగ్గరకువచ్చి తనచిరిగినచీర చాలీచాలనికొంగు చేతితోపుచ్చుకొని రామిగాడికళ్ళనీళ్ళుతుడిచింది. రామిగాడు చిన్నపిల్లవాడిలాగా ఒక్కపెట్టున బావురుమనిఏడ్చాడు. స్త్రీకి సహజమయిన ధైర్యంతో లచ్చి తల్లిలాగా తనభర్తను దగ్గరకుతీసుకుని అతనిశిరస్సుని తనహృదయానికి హత్తుకుని కురులు సవరించుతూ ధైర్యంచెప్పింది - ఏం? ఇరుగూపొరుగూ ఇళ్ళల్లో ఆడవాళ్ళు కూలికివెళ్ళడం

లేదూ? తనతల్లిమాత్రం కూలిచేసుకోవడంలా? ఇన్నాళ్లుతను ఇంట్లో కూర్చున్నదంటే అది తన అదృష్టం తనకు మంచిమొగుడుకాబట్టి తను అంతవరకూ ఎక్కడికీపనికి వెళ్లవలసిన అవసరంలేకపోయింది. రోజు లెప్పుడూ ఒకమాదిరివుంటాయా? కష్టాలొస్తాయి; సుఖాలొస్తాయి. ఆలోచనలేకుండా సుఖపడినప్పుడు కష్టపడాల్సివచ్చినప్పుడు యింతఆలోచనా, దిగులూఎందుకు? ఇంతకూ తనుపనిలోకి వెడతానంటే అందులో పెద్దచేయరానిపనేముంది?

రామిగాడు తనకామాదిరి భార్యదొరికినందుకు ఎంతో ఆనందపడ్డాడు. లచ్చిచెప్పినమాటలికి అతి సంతోషంకలిగి అతనికికళ్లవెంట జోటజోట నీళ్లుకారినాయి. భగవంతుడికి వెయ్యినమస్కారాలుచేశాడు తనకామాదిరిభార్య వచ్చినందుకు రామిగాడు. వీరిదాంపత్యాన్నిచూచిమురిసి తన సంతోషాన్ని తెల్పుతూ, అప్పుడే వుదయించిన చంద్రుడు తన చల్లటికిరణాల్ని గుడిసె గుమ్మంలోనుంచి ఆ దంపతులమీద, విచార మెరుగక హాయిగా నిద్రించేవారిద్దరి పిల్లలమీదా ప్రసరింపజేశాడు.

లచ్చి ఆవూరుపెద్ద సాహుకారుగారింట్లో పనికి కుదురుకుంది. నెలకి నాలుగురూపాయలుజీతం. రోజూ కోడికూయగానే బయలుదేరి పదిగంటలకు యింటికివచ్చేది. ఈలోగా పిల్లలులేచి ఆడుకుంటూ వుండేవాళ్లు. లేచేటప్పటికి యింట్లో ఎవరూలేకపోయినా పిల్లలు పెద్దకుటుంబాలలోలాగా ఏడ్చేవారుకారు. ఓదార్చేవారుంటేగా ఏడ్వడం! మధ్యాహ్నం యథాప్రకారంగా మొగుడికి అంబలితీసుకువెళ్లేది. మళ్లీ సాయంత్రం ఏ నాలుగుగంటలకో బయలుదేరి, దీపాలు పెట్టినతర్వాత తిరిగియింటికి చేరుకునేది.

కొత్తలో సాహుకారుగారింటికి తెల్లవారగట్ల వెళ్లడానికి లచ్చి చికాకుపడేది. ప్రొద్దుటనే అక్కడికి వెళ్లగనే సాహుకారుగారి జట్కాసాహెబు - వాడెప్పుడుచూచినా షావుకారుగారింట్లోనేవుండేవాడు, పెళ్లాంపిల్లలులేరు కాబోలు - తనని వేళాకోళాలాడుతూవుండేవాడు. పాలేళ్లుకళ్లెగరేస్తూవుండేవాళ్లు. వీళ్లిలాచేస్తున్నారని అమ్మగారికి చెప్పేందుకు ధైర్యంచాలదు. అమ్మగారుమంచిదే. చెప్పితే వాళ్లనికేకలు వేయవచ్చు - అయినాచెప్పడంఎలా? పోనీ భర్తతో చెప్పుదామనుకుంటే పనిలోకే వెళ్లవద్దంటాడేమో! అమ్మో! పనిమానివేస్తే యింకేమయినావుందా? కొంపకూలిపోదూ? ఏంచేస్తుంది, పాపం! మిల్లులో కూలివాళ్లని నిర్లక్ష్యంగాచూచినట్లే వీళ్లనీ నిర్లక్ష్యంగాచూచింది. కాని ఒకనాడు ఒకపాలేరు లచ్చిని చీకటిపడినతర్వాత గొడ్లదొడ్డిలో ఒంటరిగాచూచి చప్పుడులేకుండా వెనకనుంచివెళ్లి చల్లగా మీదచెయ్యి వేశాడు. ఛటుక్కున వెనుకకుతిరిగి పేడచేతితో ఫెడేలున లెంపపగిలేటట్టువేసింది. లచ్చి అంతటి మొండి ఘటం అనుకోలేదు ఆ పాలేరు. ఆ రోజుమొదలు మళ్లీవాడు ఆమెజోలికిపోలేదు. కాని ఆమెను చూచి నప్పుడల్లా కళ్లల్లో నిప్పులు గ్రక్కుతూవుండేవాడు.

లచ్చితెచ్చిన నాలుగురూపాయలు, రామిగాడుతెచ్చిన రోజుకూలితో, అన్నివస్తువుల ధరలు పెరిగి పోయినందున, పిల్లలికిమాత్రంపెట్టూ, తామువున్నపూటతిని లేనిపూట మాని కొన్నాళ్లుగడిపారు. లచ్చికి రానురాను తనగృహపరిస్థితి అతిదుర్భరంగా వుంది.

లచ్చికి నెలలువస్తున్నాయి; 5, 6, 7, 8. లచ్చితో బాటుసాహుకారు గారిభార్యకుకూడా నెలలు వస్తూనేవున్నాయికాని ఆమెజీవితంలో ఒడుదుడుకులులేవు. ఆమె స్వయంగా శరీరకృషిచేసి ఒకరిని పోషించనక్కరలేదు. ఆమె అనుభవిస్తున్న సౌఖ్యాన్ని, ఆమెనుగురించి యింటిలోవారు యావన్మందీ

తీసుకుంటున్న శ్రద్ధనూ నిత్యం చూస్తూవున్నా లచ్చి ఏనాడూ ఆమెఅంటే అసూయచెందడంగాని, తనను భగవంతుడు దరిద్రపుకొంపలో పడవేశాడని నిందించుకోవడంగాని, చేసిఎరుగదు. తన సంసారమే తన ప్రపంచం. తన కష్టసుఖాలు తనకు సంబంధించినవి. తను వేదాంతి కాదు. అయినా తనకుతెలిసినదొక్కటే విషయం. తన సంసారపుకష్టాలు తనుతీర్చుకోవాలిగాని యితరులుతీర్చరు. నెత్తురును ఓడ్చిఅయినా తన సంసారాన్ని తను పోషించుకుంటుందిగాని యితరులు సుఖిస్తున్నారని పదేపదే తలచుకుని తన దుఃఖాన్ని యినుమడింపజేసుకోదు.

వానాకాలం దగ్గిరపడింది. ఇంటిమీద ఆకులెన్నో లేవు. కట్టుకునేందుకు గుడ్డలు లేవు. తినేందుకు గింజలుదొరకడంలేదు. ఏమూలచూచినా, ఎక్కడవినినా ఆర్తనాదాలే, తిండిలేదనిగోలే - బియ్యంకాదు, నూకలుకాదు, జొన్నలుకాదు, రాగులుకాదు చివరికి వులవలుకూడా దొరకడంలేదు. అధమం ఏవయినా దొరుకుతాయంటే శేరొకరూపాయి. అంతడబ్బు ఎక్కడనుంచి తేవడం?

లచ్చికి తొమ్మిదోనెల - పరిస్థితులు మరీఘోరంగా తయారయినాయి. ఇప్పుడు లచ్చిదృష్టి షాహుకారుగారియింట్లోవున్న వస్తుసముదాయంపై పడసారంభించింది. వారింట్లోకరువులేదు. కొట్లలో బియ్యపుబస్తాలువేలకివేలు నిలవవేసివున్నాయి. బట్టలుతానులకుతానులేమూల్గుతున్నాయి. వారింట్లో అన్నివస్తువులూ, వుపయోగం మాలి మూలలపడివుండటం, తన సంసారాలబోటి సంసారాలు అసంఖ్యాకాలు, మలమలమాడిపోవడం ఎందుకు జరుగుతోందో, దానికి ఎవరు కారకులో ఆమెకు తెలియదు. ఆమె తెలుసుకోవాలని ప్రయత్నించలేదు. తెలుసుకోవాలని ఊహకూడా కలుగలేదు ఆమెకు. ఏవిధంగానయినా తన పిల్లలకింత తిండిపెట్టాలి. అందుకు కావలసిన నాలుగుగింజలు తను సేకరించాలి. అవి ఏవిధంగా సేకరించాలి అన్నదే ఆమె లక్ష్యం. తనలక్ష్యసిద్ధికోసం ఆమె వక్రమార్గాలు అనుసరించలేదు. నిర్లక్ష్యంగా విరజిమ్మబడివున్న ఆవస్తువులలో తనకుకావలసిన కొంచెముపాటి ఆమె దొంగిలించితే ఎవరూతెలుసుకోలేరు. కాని ఆపని ఆమెచేయలేదు. అయితే పరిస్థితులు విషమించినకొలదీ ఆమె యాచించడంలో అంతతప్పులేదని ఒక నిర్ణయానికివచ్చింది. ఒకరోజు వంచినతలతో షాహుకారుగారిభార్యకు తన కష్టాలుచెప్పుకుని కాసినిబియ్యం యివ్వమనివేడుకుంది. అడగగానే ఆవిడదయతో కొంచెంబియ్యంయిచ్చింది. అవి ఆరోజుకు సరిపోయాయి. మళ్లీవెంటనే యాచించడానికి మనసొప్పలేదు. ఒకరోజు తాళి మళ్లీ అడిగింది. అమ్మగారు మరికొంచెం బియ్యంయిచ్చారు - ఈ విధంగా తన దరిద్రం ఏనాటికితీరుతుంది? కాని ఆమె అంతదూరం ఆలోచించుకొనేటంతటి విజ్ఞానంకలిగియుండలేదు. ఆపూట తనకష్టం ఏవిధంగాతీరుతుంది అని విచారించుకోగలదుగాని అంతకుమించి విచారించుకోగలశక్తి ఆమెకేకాదు ఆమెతరగతికేలేదు.

మొదటిరెండుసార్లు అభిమానంతోనేయాచించింది. కాని ఆ అభిమానంకూడా దరిద్రదేవతా కటాక్షంవల్ల ఆమెను వీడసాగింది - తన యాచనఫలితంగా షాహుకారుగారింటినుండి ఆమె మొదటబియ్యం, తర్వాత నూకలు అటుపైన గంజినీళ్లు సంపాదించింది. కొన్నాళ్లకి ఆగంజినీళ్లు పోయడానికికూడా చీదరించుకునేస్థితిలోకివచ్చింది.

లచ్చికి పదోనెలవచ్చింది. సంసారస్థితి బాగుపడడానికి అవకాశాలు ఏమీకన్పించలేదు. పిల్లలు శల్యాలయినారు. ఒకరోజు తన అభిమానాన్నీ నీతిని చంపుకుని షాహుకారుగారింట్లో కాసినిబియ్యం దొంగిలించింది. ఒకపూటగడిచింది.

(సశేషం)

# లచ్చి సంసారం

**శ్రీ సీతారాంగారు**

(గత సంచిక తరువాయి)

తనకు ఊదరపొట్ట, పీలకాళ్లు తయారయినాయి. తన భర్త పూర్తిగా శుష్కించిపోయాడు.

షాహుకారుగారింట్లో బంధువు లెక్కువయినారు. అమ్మగారికి పురుడు దగ్గరకొచ్చివేస్తోంది. నలుగురూ నాలుగుమూలలా తిరుగుతూవుండడం మూలాన ఏవయినా అపహరించాలన్నా అవకాశందొరక కుండావుంది. విధివిరామంలేకుండా డాక్టర్లు వచ్చి ఆమెను పరీక్షచేస్తున్నారు. ఎప్పుడూ ఒకనర్సు ఆమెను కనిపెట్టే వుంటూవుంది. ఇప్పుడు షాహుకారుగారి అత్తగారు యింట్లో పెత్తనం చలాయిస్తూవుంది. ఇదివరకు 'అమ్మగారు' కొంచెందయగానయినావుండేది. ఈ 'అత్తమ్మ'గారు లచ్చిని వేపుకు తినేస్తోంది.

వర్షాలు వచ్చేశాయి. తన ఇంటిమీద ఆకులులేవు. ఒంటిమీదసరిగా గుడ్డలులేవు. తినడానికి తిండిలేదు. రెండోపిల్లవాడు శోషవచ్చి యీ రాక్షసలోకాన్నుంచి తప్పించుకుని ఎక్కడికో పోయాడు. "అమ్మా, ఆకలివేస్తోందే" అని యీ ప్రపంచాన్ని వీడేముందు గోలపెట్టితే యివ్వడానికి ఏమీలేక తనఎండిన స్తనాన్ని నోట్లోపెట్టింది. మాతృస్తనాన్ని నోటకరచుకుని గుడ్లుతేలవేశాడు.

వానలొచ్చేది, తనపిల్లడు చచ్చేది, లచ్చికి పనిమానడానికి వల్లా? ప్రపంచం అంతకర్కశమయినదా అని కొందరికి వింతకలుగవచ్చు - దయాభిక్షములతో ఒకరినొకరు ఎంతకుపోషిస్తారు? - ఎంతకాలం పోషిస్తారు? రామిగాడు ఎంతకష్టపడుతున్నాడు! ఏదిఎలావున్నా లచ్చి తను పని మానగలదా? మానితే ఎవరికినష్టం? ఒకపూటమానవచ్చు; రెండుపూటలుమానవచ్చు; అంతకుమించిమానితే జీతంతనకెందుకిస్తారు? జీతంలేకపోతే ఆమాత్రమయినాప్రాణాల్ని బొందిలో నిలబెట్టుకోవడమెట్లా? నిండునెలలతో పనికివచ్చినా "ఏం? ఎందుకొచ్చావే? పోయిఇంట్లో పడుకోకపోయినావా?" అని ఎవరడుగుతారు; షాహుకారు గారింట్లో తనమాట ఎవరికిపట్టింది? ఇరుగూపొరుగూవాళ్లకి చెప్పుకుందామంటే "రోలువెళ్లి మద్దెలతో మొరపెట్టుకున్నట్లు" వుంటుంది. వాళ్లుఅంతకంటె అధోగతిస్థితిలోవున్నారు. ఆ గుడిసెల్లోనుంచి శవం ఒకటయినా వెళ్లనిరోజులేదు. మొదట్లో కొన్నాళ్లు ఏడ్పులూ పెడబొబ్బలుపెట్టినా రానురానువారికి చావంటే భయమూ, చచ్చినవాళ్లనిగూర్చి ఏడ్వడమూపోయినాయి.

రామిగాడికిజ్వరం తగులుతూవుంది. పెద్దపిల్లవాడు మంచంపట్టాడు. జ్వరంతోనే రామిగాడు పనిలోకి వెడ్తూవున్నాడు.

వానలుబాగా ఎక్కువయినాయి. మిల్లుకట్టివేశారు. రామిగాడికిపనిపోయింది. మళ్లీఎక్కడ తిరిగినా కూలిదొరకలేదు. ఊరువిడిచిపోతే ఏపనిఅయినా దొరుకుతుందేమో! ఊరువిడిచిపోదామంటే వంటిలో శక్తిఏది? రామిగాడి మనసు చెదిరిపోయింది. జ్వరంతీవ్రమయింది.

* * * *

ఆరోజువాన కుండచిల్లిపడినట్లు కురుస్తోంది. ఇంకావాన ఎక్కువ అవుతుందనీ, తుపాను వస్తుందనీ ఎక్కడచూచినాగోల. సాయంత్రం వానకొంచెం తెరిపియిచ్చింది. లచ్చియథాప్రకారం పనిలోకిబయలుదేరింది - షాహుకారుగారిభార్యకు నొప్పులు ఆరంభమయినాయి. పదిమందిడాక్టర్లు ఆవిడచుట్టూనిలబడ్డారు. నర్సులు లోపలికి వెడ్తూవస్తూవున్నారు.

బయటఉరుములు, మెరుపులు, పనిలోకివచ్చిందేగాని ప్రాణమంతా యింటిమీదనేవున్నది. తనభర్త కెలావుందో? పిల్లడెలావున్నాడో!

షాహుకారుగారియింట్లో ఎవరిపనులలోవారు మగ్నులయివున్నారు. బయటహోరునగాలి. లచ్చి దొడ్లోకివచ్చింది. నాలుగుబొప్పాయిచెట్లు అప్పుడేగాలికి క్రిందపడినాయి. చూస్తూవుండగా స్నానాల కొట్టురేకు దారంతెగిన గాలిపడగలాగా ఎగిరిపోయిఎక్కడోపడింది. గాలీ, వాన; ఇళ్లకప్పులు తాటియాకు దళ్లు, చెట్లకొమ్మలు, బొప్పాయిచెట్లు ఎగిరిపోతున్నాయి. తనగుడిసెవున్నదా? తనపిల్లడేంచేస్తున్నాడు? తనభర్తకిఎలావుంది? చీకటిపడిపోయింది. లచ్చిఇంట్లోకిపరుగెత్తింది. ఒకమూలకాసినిబియ్యం కన్పించాయి. ఇంకోమూల పాతగొంగళీఒకటి పడవేసివున్నది. తిండిలేకకుష్కించినపిల్లడు, జ్వరంతో చలికివణికిపోతున్న భర్త కళ్లకు కన్పించారు. నాలుగుప్రక్కలాచూచింది. ఎవరూ తనను చూడడంలేదు.

"అమ్మా"—తనకూనొప్పులు బయలుదేరినాయి. అంతాఅమ్మగారి గదిచుట్టూవున్నారు. చప్పుడు కాకుండా గొంగళితీసుకుని, బియ్యంమూట కట్టేసుకుంది.

"అయ్యో"—అమ్మగారు పెడబొబ్బలుపెట్టుతూవుంది. ఇంట్లోఅంతా గాభరాపడ్తూవున్నారు. షాహుకారుగారు మతిచెడినట్లు ఆయనభార్య వున్న గదిముందు నడుమువెనుక చేతులబిగించి ముందుకీ వెనక్కీ పచార్లు చేస్తున్నాడు.

లచ్చికీ నొప్పులు ఎక్కువవుతున్నాయి. కళ్లుతిరుగుతున్నాయి. ప్రపంచమంతా తిరిగిపోతోంది కళ్ల ముందు. నొప్పులుబాగా అధికంగావున్నాయి. కాళ్లుతడబడుతున్నాయి. బియ్యం, గొంగళీ విడవకుండా గట్టిగాపట్టుకుని ఎలాగో మెల్లగావీధిలోపడింది.

గాలీ, వానా!

ఆగాలిలో నిలబడ లేక పోతోంది-గాలితోసివేస్తోంది-చినుకులు మొహానరాళ్లుపెట్టికొట్టినట్లు చురుకు మని తగులుతున్నాయి. ఎలాగో ఒకపది అడుగులునడిచింది. ఇంతలో, "లచ్చీ—ఓ లచ్చీ!" అని పిలుపు, వెనక్కితిరిగిచూచింది. ఎవరోయింట్లోనుంచి తననుపిలుస్తున్నారు. మొదట్లోకంటికేమీకనపడలేదు. తర్వాత షాహుకారుగారి అత్తగారు వీధిచీడీలోనుంచి తనను పిలుస్తున్నట్లుగాతోచింది—తనచేతిలోమూటచూచిందా? అమ్మో! చూస్తే, ఏంచేస్తారో? ఇంట్లోకి తిరిగివెళ్లాలంటే భయంవేసింది. మాటవినిపించుకోనట్లుగా ముందుకుసాగింది; కానిగాలినడవనిస్తేనా? తనవెనకాలే ఎవరోవచ్చారు - షాహుకారుగారిపాలేరు, తను ఎడచేతితో లెంపకాయకొట్టిందే-ఆపాలేరు.

"ఏందేయ్ పట్టుకెడ్తున్నావ్? ఎవరూచూడటం లేదనుకున్నావుగామోసు" అన్నాడు. లచ్చి చేతితోవున్నమూటను కలియబడిలాగుకుంటూ. విడవకుండా పట్టుకునేశక్తిలేదు లచ్చికి - అప్రయత్నంగానే మూటను విడిచిపెట్టేసింది

నొప్పులు బాగాతీవ్రమయినాయి. తనఇంటివైపుసాగింది మహాభారంతో. ఒకమెరుపుమెరిసింది. ఆమెరుపువెలుగులో పాలేరులచ్చినిచూచాడు, ఆదైన్యదృశ్యం చూచేటప్పటికి అతనిగుండెలు చివుక్కుమన్నాయి. ఎక్కడినుంచో జాలివచ్చిపడిందతని హృదయంలో. ఛా, తనెంతపాడుపనిచేశాడు? పాపం ఎంతఅవస్థపడుతూవుంది? తనుమాత్రం బియ్యంయిదివరకు ఎన్నిసార్లు ఎత్తుకుపోలేదు? లచ్చినడవలేక నడవలేక మహాభారాన్నంతా తనమీదపెట్టుకున్నభూదేవివలె నడిచిపోతోంది. పాలేరుకళ్ళలో గంగబయలుదేరింది. "లచ్చీ! — ఆగు" అనికేకవేయబోయినాడుగాని నోటమాటరాలేదు. బియ్యం, గొంగళీ, ఇచ్చివేయడానికి పరుగెత్తాడు.

ఇంతలో మహాపెద్దరాక్షసిలాగ ఓ పెద్దచెట్టు విరుచుకుపడిందిమీద—చెట్టుక్రిందపడి నలిగిపోయాడు పాలేరు. లచ్చి నడుస్తూనేవుంది.

*         *         *         *

రామిగాడికిజ్వరం చాలాతీవ్రంగావుంది. ఏదోఆలోచనలో మునిగిపోయి చాలాసేపటివరకు ప్రపంచమే మరచిపోయాడు. ఒకమూలగాలీవానా దంచుతూనేవుంది. ఇరుగూపొరుగూ ఇళ్లువదిలేసి ప్రాణాలు రక్షించుకునేందుకు పారిపోతున్నారు. పారిపోతూ ఆచీకట్లో అతనిగుడిసెముందునిలిచి ఒకరిద్దరు "రామిగా" అని కేకలువేశారుగాని జవాబులేకపోవడంమూలాన లోపలఎవరూలేరనుకుని వెళ్లిపోయారు. రామిగాడు అసలు ఏతుపానుల్ని లక్ష్యంచేసేస్థితిలోలేడు. ప్రపంచం విరుచుకుమీదపడినప్పటికీ అతనికింతకంటే కలిగేబాధేమిటి?

ఇంటిమీదఆకులు ఎగిరిపోయాయి. ఒకప్రక్కమంటిగోడపడిపోయింది. రామిగాడికి కొంచెం కొంచెం తెలివివచ్చింది. మెల్లగాలేచాడు. తడిసిపోయినతలపిండుకున్నాడు. ఓమూలపిండుతూవుంటే మళ్లీతడుస్తూవుంది. ప్రక్కనమంచంలో పిల్లడిని తడిమిచూచాడు - చల్లటిముద్ద. పలకరించాడు - 'ఊ' లేదు; 'ఆ' లేదు. గట్టిగావిదిలించాడు - ఊహూ. పిల్లణ్ణిభుజానవేసుకుని బయటికొచ్చాడు. అంతానిర్జీవంగావుంది. వాన కురుస్తూనేవుంది. మెరుపువెలుగులో పడిపోయిన ఇళ్లూచెట్లూ కన్పిస్తూవున్నాయి.

లచ్చియింకారాలేదు. ఇంతసేపు ఏమిచేస్తూవుందో? వానలోరాలేకపోయిందా? లేకదోవలో ఏచెట్టుక్రిందనయినా పడిపోయిందా? లేక ఎచెట్టుక్రిందనో నొప్పులుపడుతోందా? ఏమయిందిలచ్చి? ఇంతవరకూ ఎందుకురాదు? ఏ యిల్లయినావిరిగి మీదపడలేదుగదా? అయినా అలాఎందుకనుకోవాలి? వానగావుందని షాహుకారుగారియింట్లోనే వుండిపోయిందేమొ! - రామిగాడిమనసు బేజారయిపోయింది. అసలుఆపూటలచ్చినిపనిలోకి తానెందుకువెళ్లనిచ్చాడు? లచ్చిఏమయింది? ఎవరినడగడం? లచ్చిలేకపోతే తానెందుకింకబ్రతికి? తనమీదకూడాఏచెట్టో, ఇల్లో విరిగి పడిపోకూడదు? ఇలామనోక్షోభపడుతూనే లచ్చికోసం బయలుదేరాడు - పిల్లడు భుజంమీదనేవున్నాడు - ఎక్కడినుంచో పెనుభూతంలాగు రంయిమంటూ ఓపెద్దరేకు విరుచుకుమీదపడింది. "అమ్మ చచ్చానురా బాబోయ్" అనిచతికిలపడ్డాడు. అదృష్టవశాత్తు చతికిలపడటంలో రేకుదూసుకుపోయింది. ఒకప్రక్కమాత్రం గీసుకుపోయింది. మెల్లిగాలేచాడు. ఈ ఖంగారులోపిల్లవాడు జారిపోయాడు. క్రిందబురదనీటిలో పొర్లాడుతోంది ఆ పసిపాపడికళేబరం. పిల్లణ్ణి గబగబా చేతుల్లోకి తీసుకున్నాడు. బాగాబరువెక్కవైనాడు - తడిమిచూచాడు - పూర్తిగా అళవదులుకున్నాడు. కానికంట ఒకచుక్కనీరయినాకారలేదు. ఎండినశరీరంలో ఏడవ్వాలన్నా నీరెక్కడవుంటుంది? పిల్లడ్నిగట్టిగా హత్తుకున్నాడుగుండెలికి. విడవలేకవిడవలేక ఆ కళేబరాన్ని భుజంమీదవేసుకుని లచ్చికోసం బయలుదేరాడు.

వెనక ఎక్కడనుంచో మహాసముద్రంలాగా నీరువచ్చేస్తోంది. ఆ నీటిమీద తేలినగుడిసెలు మెరుపుల వెలుగులో భూతాలలాగా తైతక్కలాడుతున్నాయి.

రామిగాడునడుస్తూనేవున్నాడు. ఒకింతదూరాన ఓ మెరుపువెలుగులో రామి గాడికి లచ్చికనిపించింది. నెత్తిమీదనుంచి కారేనీరు మ్రింగుకుంటూ, ఒకచేతితో కడుపుపట్టుకుని ఇంకొకచేతితో గాలిలోత్రోవ తడుముకుంటూ శరీరాన్ని ముందుకునెట్టుకువస్తోంది లచ్చి. ఆగాలీవానలో.-పరుగెత్తబోయాడు రామిగాడు; పరుగెత్తలేకపోయాడు. భుజంమీది పాపడికళేబరం తనకుతెలియకుండానే జారిపోయింది. మెల్లగాలచ్చివైపు నడిచాడు. లచ్చిదగ్గరకొచ్చింది. వాళ్లిద్దరూ దగ్గరకుచేరుకున్నారుగదాఅని ప్రకృతి తనఆనందాన్ని తెల్పుతూ ఒకమెరుపునంపింది. ఆ మెరుపువెలుగులో ఆ దంపతులు ఒకరినొకరుచూచుకున్నారు. రంయ్‌మనిగాలి వీస్తోంది. రామిగాడిని తరుముకువస్తూవున్న ప్రళయప్రవాహం వారినప్పుడే సగంవరకుముంచివేసింది. లచ్చి రామిగాడిని సమీపించింది. ఇకనడవలేక తనభర్తచేతులలోకి ఒరిగిపోయింది. ఆమెభారమును ఆపలేక ఆమెనుగట్టిగాకౌగలించుకుంటూ కృంగిపోజొచ్చాడు రామిగాడు - ప్రవాహం ఎక్కువయింది - కాని యింక ఏ ప్రవాహమయినా వారినేమిచేయగలదు? వారుఒకరినొకరుకలుసుకున్నారు. ఆకలయికలో వారి బాధలన్నీ మటుమాయమయినాయి. ప్రకృతివారిని కనికరించింది. వారీప్రపంచాన్ని మరచిపోయారు. అవును! తమపై దయచూపని ఘోరరాక్షస ప్రపంచాన్ని వారెందుకు జ్ఞాపకం వుంచుకోవాలి?





బిటా కేఫిన్ (తలనొప్పి బిళ్లలు)

తలనొప్పి, పంటినొప్పి, కాళ్లనొప్పి, నిద్రలేకుండుట, కీళ్ళనొప్పులు, మలేరియా, స్త్రీల బహిష్టునొప్పులు, అలసట వగైరా అన్నిటికి గ్యారంటీగా పనిచేయును.

వాడుకొనువిధము పొట్లములోనుండును.

పొట్లం 3 బిళ్ళలు 1 అణా.

బిటాలాక్సు (చాక్‌లెట్ భేదిబిళ్ళలు)

సుఖవిరేచనౌషధము

ఇది చాక్‌లెట్ భేది బిళ్లలు. సుఖ విరేచనము కలిగించి మలబద్ధమును పోగొట్టి మంచి జీర్ణశక్తి నిచ్చును.

అన్నిచోట్ల దొరకును. పొట్లం 2 బిళ్ళలు 1 అణా.




స్టాకిస్టులు:—దాదా అండ్ కంపెనీ,—పి. టి., మద్రాస్.

తయారుచేయువారు:

Bombay Tablet Manufacturing Co.,
Post Box No. 2092, BOMBAY 2.